క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి వెండి ఆభరణాల బహూకరణ



ఆలయ కమిటీ సభ్యులకు ఆభరణాలను అందజేస్తున్న హర్షవర్ధన్‌గౌడ్

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయానికి గురువారం పట్టణానికి చెందిన భక్తులు మణికొండ హర్షవర్ధన్‌గౌడ్ రెండుకిలోల వెండి ఖడ్గం, కాసులహారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఒగ్గు కిషోర్, భూపాల్, సాయి ఈశ్వర్‌రెడ్డి, దాస రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దుకాణాలకు బహిరంగ వేలం



వేలం వేసే దుకాణ సముదాయం

మొయినాబాద్‌రూరల్: మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా గల దుకాణాలను(షెటర్లు) వ్యాపారం నిమిత్తం అద్దె ఇచ్చేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తామని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఇప్పటికే 24 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నేడు 28వ తేదీ 12 గంటల వరకు దరఖాస్తుల స్వీకరించవచ్చన్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాటలో తెలిపిన నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు చేసుకునే వారందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

ఉచిత వైద్య శిబిరం

మొయినాబాద్: గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చిలుకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులో అపోలో నర్సింగ్ కాలేజీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో అపోలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జయసుధ, అధ్యాపకులు లావణ్య, భారతి, శ్రీవాణి, డాక్టర్లు శిరీష, స్నిగ్ధ పట్నాయక్, సత్య గోపాల్, నిరూపమ, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రోత్సాహం ఎంతో అవసరమని శ్రీరాంనగర్ ఎంపీటీసీ రాంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు నగరానికి చెందిన దాత మాణిక్‌రావు సహకారంతో గురువారం నోట్‌పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో దాత మాణిక్‌రావు, హెచ్‌ఎం జంగయ్య, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఉమాదేవి, అలివేలు, అనంతయ్య పాల్గొన్నారు.

చేవెళ్ల సీఐగా భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: సైబరాబాద్ పరిధిలోని గురువారం జరిగిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలలో చేవెళ్ల ఇన్‌స్పెక్టర్ లక్ష్మారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చేవెళ్ల ఇన్‌స్పెక్టర్‌గా ఎం.భూపాల్ శ్రీధర్ స్పెషల్ బ్రాంచ్ నుంచి చేవెళ్లకు బదిలీపై వస్తున్నారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి బదిలీపై ఐటీ కారిడార్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌హెచ్‌ఓగా వెళ్తున్నారు. ఎనిమిది నెలల క్రితమే సీఐగా లక్ష్మారెడ్డి చేవెళ్లకు వచ్చారు. ఎనిమిది నెలల కాలంలో తన విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందారు. చేవెళ్లకు డీఐ ఇన్‌స్పెక్టర్‌గా మాదాపూర్ నుంచి జి.రమేశ్‌నాయుడు వస్తున్నట్లు బదిలీ ఉత్తర్వులు విడుదల చేశారు.

బస్సులు లేక.. ఆటోలే దిక్కాయె

- గ్రామాలకు తగ్గిన ఆర్టీసీ సర్వీసులు
- ఇబ్బందులుపడుతూ వెళ్తున్న ప్రయాణికులు
- విద్యార్థులకు తప్పని కాలినడక



రెడ్డిపల్లిలో ఆటోలో వెళ్తున్న విద్యార్థులు



మొయినాబాద్‌లో బస్సులు లేక ఆటోల్లో వెళ్తున్న ప్రయాణికులు

మొయినాబాద్: హైదరాబాద్ నగర శివారులో ఉన్న మొయినాబాద్ మండలంలోని అన్ని గ్రామాలకు గతంలో ఆర్టీసీ బస్సులు నడిచేవి. కరోనా లాక్‌డౌన్ తరువాత పరిస్థితి మారిపోయింది. గ్రామాలకు ఆర్టీసీ సేవలు పూర్తిగా తగ్గిపోయాయి. మండల కేంద్రంతో పాటు చిలుకూరు బాలాజీ దేవాలయానికి మాత్రమే ఆర్టీసీ బస్సులు ఎక్కువగా నడుస్తున్నాయి. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూర్ ప్రాంతాలకు వెళ్లే బస్సులు నడుస్తున్నాయి. ఈ సర్వీసులు మొయినాబాద్, హిమాయత్‌నగర్ గ్రామాల ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. మండలంలోని మిగతా గ్రామాల ప్రజలు, విద్యార్థులు, రైతులు బస్సుల కోసం ఇబ్బంది పడక తప్పడం లేదు.

భారీగా తగ్గిన బస్సులు..

కరోనా లాక్‌డౌన్ తరువాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు భారీగా తగ్గాయి. బాకారం గ్రామానికి గతంలో రోజుకు 30 ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు నడువగా ఇప్పుడు కేవలం 4 ట్రిప్పులు మాత్రమే నడుస్తున్నాయి. అమ్డాపూర్ గ్రామానికి 24 ట్రిప్పులు వచ్చేది. ఇప్పుడు 4 ట్రిప్పులు మాత్రమే వస్తుంది. శ్రీరాంనగర్‌కు 14 ట్రిప్పులు వచ్చేది. ఇప్పుడు 3 ట్రిప్పులు నడుస్తుంది. వెంకటాపూర్‌కు 10 ట్రిప్పులు సర్వీసులు వచ్చేవి. ఇప్పుడు కేవలం 2 ట్రిప్పులు మాత్రమే వస్తున్నాయి. కేతిరెడ్డిపల్లికి గతంలో 10 ట్రిప్పులు రాగా ఇప్పుడు 2 ట్రిప్పులు మాత్రమే వస్తున్నాయి. కనకమామిడికి 10 ట్రిప్పులకు ఇప్పుడు 2 ట్రిప్పులు, మేడిపల్లికి 8 ట్రిప్పులకు ఇప్పుడు 2 ట్రిప్పులు, చిన్నమంగళారంకు గతంలో 14 ట్రిప్పులకు ఇప్పుడు 3 ట్రిప్పులు మాత్రమే బస్సులు నడుస్తున్నాయి. మండలంలోని చాకలిగూడ, సజ్జన్‌పల్లి, అప్పారెడ్డిగూడ, అప్పోజీగూడ, ఎలుకగూడ, కాశీంబౌలి తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సేవలు పూర్తిగా నిలిచిపోయాయి.

పెరిగిన ఆటోలు..

గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఆటోలు పెరిగాయి. ప్రతి గ్రామానికి ఇప్పుడు నాలుగైదు ఆటోలు నడుస్తున్నాయి. బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, రైతులు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న ఆటో డ్రైవర్లు నలుగురు కూర్చునే ఆటోలో 12–16 మందిని ఎక్కిస్తూ ప్రమాదకర ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ప్రతిరోజు వేలమంది యువకులు, మహిళలు పనులకోసం గచ్చిబౌలి, నగరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. గ్రామాల నుంచి బస్సులు లేకపోవడంతో సొంత వాహనాలు, ఆటోల్లో హైదరాబాద్–బీజాపూర్ రహదారి వరకు వచ్చి అక్కడి నుంచి బస్సుల్లో వెళ్తున్నారు. చిన్న గ్రామాల నుంచి ఉన్నత పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు నడుచుకుంటూ, ఆటోల్లో వెళ్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



గతంలో ప్రతి రోజు శ్రీరాంనగర్‌కు 10 ట్రిప్పులు, శంషాబాద్‌కు 6 ట్రిప్పులు సురంగల్ మీదుగా ఆర్టీసీ బస్సులు నడిచేవి. కరోనా లాక్‌డౌన్ తరువాత శ్రీరాంనగర్‌కు వెళ్లే రెండు ట్రిప్పులు మాత్రమే సురంగల్ మీదుగా వెళ్తున్నాయి. దీంతో చాలా ఇబ్బంది అవుతుంది. ఎక్కడికి వెళ్లాలన్నా ఆటోల్లో, సొంత వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది.

- శ్రీనివాస్‌చారి, సురంగల్, మొయినాబాద్ మండలం

గ్రామాలకు సర్వీసులు పెంచాలి



గ్రామాలకు బస్సులు సరిగా రాక విద్యార్థులు, రైతులు, ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే సమయాల్లో బస్సులు నడపాలి. బస్సుల సంఖ్య పెంచాలని ఆర్టీసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదు.

- అర్జున్, ఎంపీటీసీ, బాకారం

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి

యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్



దీక్షలో కూర్చున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఫీజులు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ గురువారం యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. చాలా పాఠశాలల్లో కనీస సదుపాయాలు కూడా లేవన్నారు. ఇరుకు గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారన్నారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వీరి దీక్షకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య మాదిగ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సాయి ప్రసాద్, వినయ్‌కుమార్, జంగయ్య, రహమతుద్దీన్, నర్సింహా, అశోక్, ఉదయ్, శ్రీకాంత్, ఇంద్ర, ఇంతియాజ్, రవితేజ, మాధవాచారి, నవీన్‌కుమార్, సిద్ధు, కుమార్, రాములు, రమేశ్, అభినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

ఏసీపీకి బీజేపీ, టీడీపీ నేతల వినతి



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ శివారులోని సిరిసంపద టౌన్‌షిప్ ప్రాంతంలో గల వెంచర్‌లోని గుట్టల్లో అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం బీజేపీ, టీడీపీ నేతలు షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామిని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింలు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, తదితరులు ఏసీపీ రంగస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సిరిసంపద వెంచర్ సమీపంలో ఉన్న గుట్టల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు చట్టవ్యతిరేకంగా బ్లాస్టింగ్ చేస్తున్నారని, దీంతో చుట్టుపక్కన ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. జనావాసాలు ఉండే ప్రాంతంలో అక్రమంగా బ్లాస్టింగ్‌కు పాల్పడటం సరికాదన్నారు. వ్యాపార ప్రయోజనాల కోసం ప్రకృతిని తొలగించడం సరికాదన్నారు. అదేవిధంగా వెంచర్‌లో ఉన్న దేవాలయాన్ని కూడా నేలమట్టం చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటామని ఏసీపీ హామీనిచ్చారు.

బ్లాస్టింగ్ ప్రాంతం పరిశీలన

సిరిసంపద వెంచర్ సమీపంలో బ్లాస్టింగ్ చేసిన గుట్టలను బీజేపీ, టీడీపీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న దేవాలయాన్ని వారు పరిశీలించారు. బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

మొయినాబాద్‌లో మోస్తరు వర్షం



హిమాయత్‌నగర్‌లో కురుస్తున్న వర్షం

మొయినాబాద్‌రూరల్: కురిసిన చిరుజల్లులతో ఆయా గ్రామాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. వానదేవుడు ఇప్పటికే కురిసి వాగులు, వంకలు పొర్లి ఉండాల్సింది కానీ వర్షం పడకపోవడంతో జూన్ నెల మొత్తం భానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోయారు. గురువారం తెల్లవారుజాము నుంచే మేఘాలు కమ్ముకొని అక్కడక్కడ చిరుజల్లులు, మోస్తారు వర్షం కురిసింది. మండల పరిధిలోని హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, ఎన్కెపల్లి, బాకారం కాశీంబౌలి, నదీమ్‌నగర్, ముర్తుజాగూడ, అమ్డాపూర్, జీవన్‌గూడ ఆయా గ్రామాల్లో కురిసిన మోస్తారు చిరుజల్లులతో వాతావారణం చల్లబడి ఈదురుగాలులు వీచాయి.

ఆలయ కమిటీ నియామకానికి నోటిఫికేషన్ విడుదల

కొందుర్గు: కొందుర్గు లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ పాలక మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎండోమెంట్ ఈఓ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 16వ తేదీలోగా సహాయ కమిషనర్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కళాభవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యేకు కళాకారుల వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కళాకారులు

షాద్‌నగర్: కళా భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పట్టణానికి చెందిన పలువురు కళాకారులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సభ్యుడు టీవీ రంగయ్య ఆధ్వర్యంలో పలువురు కళాకారులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. షాద్‌నగర్ ప్రాంతంలో ఎంతో మంది కళాకారులు ఉన్నారని, వారు తమలోని ప్రతిభను ప్రదర్శించేందుకు సరైన వేదిక లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న కళా భవనం నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, త్వరగా పూర్తి చేసి కళాకారులకు భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కళాకారులకు, కళల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని కళాకారులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కళాకారులు వడ్ల రమేశ్‌చారి, రవీందర్, శివ, సింగారం శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం

బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్



ప్రింటర్ అందిస్తున్న దాత కృష్ణగౌడ్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి సహాయ సహకరాలను అందించాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు గొండ్ల కృష్ణాగౌడ్ అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం దాత కృష్ణగౌడ్ కొత్త ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి దాతలు అందించే సహకారం మరువలేనిదన్నారు. గ్రామానికి చెందిన న్యాయవాది, బీజేపీ నాయకుడైన గొండ్ల కృష్ణగౌడ్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరం కూడా విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను అందించారని, విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు ఒక ప్రింటర్ కావాలని కోరటంతో వెంటనే ఆయన స్పందించి ప్రింటర్‌ను అందించారన్నారు. ఆయనకు ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బోగం నరేందర్, దర్శన్‌గౌడ్, విజయ్‌కుమార్, రమణారెడ్డి, నాయకులు రమణారెడ్డి, ఉపాధ్యాక్షుడు తెలుగు కృష్ణ మోహన్, విద్యార్థులు, గ్రామస్తులు ఉన్నారు.

కవాతును విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహా మాదిగ

షాద్‌నగర్‌రూరల్: వచ్చే నెలలో వరంగల్‌లో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహా మాదిగ కోరారు. గురువారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన నర్సింహా మాదిగ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ దండోరా ఉద్యమం ఆవిర్భవించి 30 సంవత్సరాలు అవుతుందన్నారు. ఈ సందర్భంగా వరంగల్‌లో వచ్చేనెల 7 ఆత్మగౌరవ కవాతును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు దశాబ్దాల దండోరా ఉద్యమ చరిత్రలో సమాజం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతికి, సామాజిక మానవీయ కోణంలో ఉద్యమాలు చేశామన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం చివరిదశకు వచ్చినందున అందరూ ఐక్యంగా ఉండి వర్గీకరణను సాధించుకుందామన్నారు. మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రవికుమార్, అశోక్, శ్రావణ్, లక్ష్మయ్య, శ్రీనివాస్, బాలు,పాండు, భూషణ్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

షాద్‌నగర్: పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రెండురోజులుగా ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కట్టా ప్రవీణ్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు పుల్లయ్య, అర్చకుడు రాఘవేంద్రాచార్యులు పాల్గొన్నారు.

కేజీబీవీ భవనాన్ని ప్రారంభించండి

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీకాంత్

కడ్తాల్: మండల కేంద్రంలో నిర్మించిన కేజీబీవీ పాఠశాల నూతన భవనాన్ని త్వరగా ప్రారంభించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇరవై రోజులు కావొస్తున్నా నూతన భవనంలో పాఠశాల తరగతులు ప్రారంభించకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. గతేడాది పాఠశాల తరగతులు కొనసాగిన అద్దె భవనంలో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ ఏడాది కూడా అద్దె భవనంలోనే తరగతులు నిర్వహిస్తే ఎలా అన్నారు. స్థానిక ఎమ్మెల్యే దృష్టిసారించి వెంటనే పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించాలని కోరారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అజిత్, రమేశ్, అఖిల్, గణేశ్, రామ్ తదితరులు ఉన్నారు.

తవ్వారు.. మరిచారు

- హిమాయత్‌నగర్‌లో ప్రమాదకరంగా గుంతలు
- పట్టించుకోని ప్రత్యేక గ్రామ అధికారులు



చిలుకూరు బాలాజీకి వెళ్లే రహదారి పక్కన తవ్వి వదిలిన గుంత



ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రహదారిలో రోడ్డుకు అడ్డంగా వేసిన రాళ్లు, మట్టి

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో గ్రామాలకు వెళ్లే రోడ్ల పక్కన గుంతలు తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. మంచినీటి పైపులైన్‌ల లీకేజీల పేరుతో పనులు పూర్తి చేసి పూడ్చి వేయడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. గుంతలు పూడ్చిన వద్ద రోడ్డుకు అడ్డంగా రాళ్లు, మట్టిని పోయడంతో వాహనాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పాలన ముగిసిన తరువాత ప్రత్యేక పాలనలో గ్రామాలభివృద్ధిలో కుంటుపడిపోతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లను నియమించినా మండలంలోని ఆయా గ్రామాలను వారు కన్నెత్తి చూడడం లేదని పేర్కొంటున్నారు. మరికొన్ని గ్రామాల్లో గ్రామ సభలకు ముఖ్యంగా ప్రత్యేక అధికారులు రాకపోవడంతో గ్రామ సభలు నిర్వహించలేకపోయారు. ఇది ఇలా ఉంటే హిమాయత్‌నగర్ గ్రామంలో రోడ్లకు అడ్డదిడ్డంగా గుంతలు ఉండడం, గ్రామస్తులు చిలుకూరు బాలాజీకి వెళ్లే ప్రయాణికులు, వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వానమ్మా.. రావమ్మా

కప్పకావడి కట్టి వరుణదేవుడికి పూజలు



తిర్మలాపూర్‌లో కప్పవడితో మహిళలు



తాళ్లపల్లిలో వరద పాశం పోసి పిల్లలతో నాకిస్తున్న మహిళలు

షాబాద్: జూన్ ముగుస్తున్నా జిల్లాలో సరైన వర్షాలు కురవడం లేదు. దీంతో ఇప్పటికే నాటిన ఆరుతడి పంటలు ఎండుముఖం పట్టగా.. వరినారు పోసుకునేందుకు కూడా కార్తెలు కరిగిపోతున్నాయి. దీంతో ఆందోళన చెందుతున్న అన్నదాతలు వానమ్మా.. రావమ్మా అంటూ ఆకాశంవైపు ఆశగా చూస్తున్నారు. మరోదిక్కు కొందరు మహిళలు కప్పకావడి కట్టి.. వరుణుడు కరుణించాలని పల్లెపాటలు పాడుతూ భిక్షాటన చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం షాబాద్ మండలంలోని తాళ్లపల్లి, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వరద పాశం పోసి పిల్లలతో నాకించారు. నాగరగూడ, తిర్మలాపూర్ గ్రామాల్లో కొందరు మహిళలు కప్పవడితో అయ్యయ్యో వానదేవ.. రామోజీరామ అంటూ వరుణదేవుడిని వేడుకుంటున్నారు. గ్రామ దేవతలకు పూజలు చేశారు. దీంతో కొంత వర్షం పడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.